క్లుప్తంగా

పోస్టల్ బ్యాలట్‌లు 3052

మార్కాపురం టౌన్: మార్కాపురం నియోజకవర్గానికి సంబంధించి ఈనెల 27వ తేదీ నాటికి మొత్తం 3052 పోస్టల్ బ్యాలెట్లు వచ్చినట్లు సబ్‌కలెక్టర్, ఆర్‌ఓ రాహుల్‌మీనా మంగళవారం తెలిపారు. ఇందులో ఎన్నికల డ్యూటీ, పీఓలు, ఏపీఓలు, పోలీసు, సెక్టార్ ఆఫీసర్స్ తదితర విభాగాలకు చెందిన వారు 2351 మంది, ఎసెన్షియల్ సర్వీసెస్ కింద 244 మంది, జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎన్నికల డ్యూటీ చేసిన వారు 153 మంది, ఇంటర్ డిస్ట్రిక్ట్ ఎసెన్షియల్ సర్వీస్ విభాగంలో 18 మంది, హోమ్ ఓటింగులో 169 మంది, సర్వీసు ఓటర్లు 117 మంది మొత్తం 3052 మంది పోస్టల్ బ్యాలట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంచుకోవచ్చు



వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

బేస్తవారిపేట: గ్రంథాలయాల్లో రోజూ పుస్తకాలను చదవడంతో విజ్ఞానాన్ని పెంచుకోవచ్చని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. 35 మంది విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్, స్పోకెన్ ఇంగ్లిష్, చెస్, క్యారమ్స్, క్విజ్, డ్యాన్స్, చదవడం, రాయడంపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

దర్శి: పట్టణంలో నూతన విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తున్న సందర్భంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ బి.వేణుగోపాల్ తెలిపారు. పట్టణంలోని లంకోజనపల్లి రోడ్డు , పుట్టబజార్‌లో విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించగలరని కోరారు.

పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

దొనకొండ: విద్యార్థులు పుస్తకాలు చదవటం అలవాటు చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథపాలకులు ఎల్.సుమతి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో మంగళవారం సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థుల్లో కలిగే భయాన్ని ఎలా అధిగమించాలనే అంశంపై తరగతులు నిర్వహించారు. జూనియర్ కళాశాల అధ్యాపకురాలు విజయలక్ష్మి పాల్గొని విద్యార్థులకు నీతి కథలు చెప్పారు. అదే విధంగా చదవటం, కథలు చెప్పటం, పద్యాలు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం జూన్ 7వ తేదీ వరకు ఉంటుందన్నారు. 22 మంది విద్యార్థులు హాజరయ్యారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



కందులాపురంలో స్వాధీనం చేసుకున్న వాహనాలు



డాక్యుమెంట్లను పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు

కొనకనమిట్ల: ఎన్నికల ఎన్నికల కౌంటింగ్ రోజున ఎవరైనా గ్రామాల్లో అల్లర్లు సృష్టించి గొడవలకు కారణమవుతారో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మాధవరావు అన్నారు. మంగళవారం కొనకనమిట్ల, గొట్లగట్టు గ్రామల్లో రాజకీయపార్టీల నాయకులతో పాటు ప్రజలతో సమావేశాలు నిర్వహించి శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావులేకుండా సమన్వయం పాటించి ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని అన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో దుకాణాలను తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా దుకాణాల్లో క్రాకర్స్ అమ్మకూడదన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే పలు వాహనాలను తనిఖీ చేశారు.

లా అండ్ ఆర్డర్‌కు సహకరించండి

మార్కాపురం: మార్కాపురం పట్టణ, రూరల్ పరిధిలో లా అండ్ ఆర్డర్‌కు ప్రజలందరూ సహకరించాలని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం ఉదయం పట్టణ శివార్లలోని పూలసుబ్బయ్య కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించి అనుమతి లేకుండా ఉన్న పది బైకులను సీజ్ చేసినట్లు తెలిపారు. యువతకు, కాలనీవాసులకు కౌన్సెలింగ్ చేశారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ

కౌంటింగ్ అనంతరం ఎవరైనా గొడవలు చేసినా.. సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తి చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ రూరల్ ఎస్సైలు అబ్దుల్ రెహమాన్, వెంకటేశ్వర నాయక్, ఏఎస్సైలు మునాఫ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కందులాపురంలో కార్డెన్ సెర్చ్

కంభం: కందులాపురం పంచాయతీ పరిధి పూసల బజారులో మంగళవారం ఉదయం సీఐ జె.రామకోటయ్య ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ చేశారు. పోలీసులు ప్రతి ఇంటిని జల్లెడ పట్టి సరైన ధృవపత్రాలు లేని 7



కొనకనమిట్ల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎస్ఐ

ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ దగ్గర పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పోలీసుల గస్తీ పెరిగిందని సీఐ తెలిపారు. గ్రామాల్లో ప్రజలు సంయమనం పాటిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు. ఎవరైనా అనవసరమైన గొడవలకు దిగినా, ఇతర వర్గాల వారిని రెచ్చ గొట్టే వ్యాఖ్యలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరైన ధృవీకరణ పత్రాలు సమర్పించి వాహనాలు తీసుకెళ్లాలని సూచించారు. కార్డెన్ సెర్చ్‌లో కంభం, అర్ధవీడు ఎస్సైలు పులి రాజేష్, అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

జయ కృష్ణా ముకుందా మురారి



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



హోమాలలో పాల్గొన్న భక్తులు

● వేడుకగా శ్రీవేణుగోపాలస్వామి కల్యాణం

కొనకనమిట్ల: జయ కృష్ణా ముకుందా మురారీ అంటూ కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో మంగళవారం శ్రీరుక్మిణీ, సత్యభామ సహిత శ్రీవేణుగోపాలస్వామి వారి కల్యాణం భక్తుల జయ జయధ్వానాలతో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలో వెలసిన రామదూత క్షేత్రంలో 12వ ద్వాదశ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా రామదూత క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకట రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో ముందుగా హోమాలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం రుక్మిణీ సత్యభామ సహిత వేణుగోపాల కృష్ణస్వామి కల్యాణం భక్తుల జయజయ ధ్వానాలతో, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య మంగళ వాయిద్యాలతో నిర్వహించారు. కల్యాణ ఉభయదాతలుగా ఎం.రమేష్‌బాబు, నివేదిత, జి.ఆంజనేయులు, మూర్తెమ్మ దంపతులు వ్యవహరించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. బుధవారం వెంకటేశ్వర స్వామి కల్యాణం ఉంటుందని, అలాగే జూన్ 1వ



భక్తి పాటలు ఆలపిస్తున్న భజన బృందం

తేదీ వరకు శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు యక్కంటి తిరుపతిరెడ్డి, గొలమారి విష్ణువర్ధన్‌రెడ్డి, వెలిశెట్టి వెంకటనారాయణ, వి.వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.

జైలును ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా జడ్జి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని సబ్ జైలును జిల్లా జడ్జి భారతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీల వివరాలను సూపరింటెండెంట్ లింగారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ఖైదీలతో మాట్లాడుతూ క్షణికావేశంలో మీరు చేసిన తప్పులతో జైలు శిక్ష అనుభవిస్తూ కుటుంబ సభ్యులను కూడా ఇబ్బందులకు గురిచేశారన్నారు. శిక్ష పూర్తి అయిన తర్వాత సమాజంలోకి ప్రవేశించినప్పుడైన ప్రవర్తనను మార్చుకోవాలని సూచించారు. న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్థోమత లేని వారి కోసం ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి వస్తున్న సదుపాయాలు, వసతుల గురించి అడిగి తెలుసుకు



జైలు అధికారితో మాట్లాడుతున్న జడ్జి భారతి

న్నారు. ఆహార పదార్థాలను నిల్వ ఉంచే స్టోరు రూమ్‌ను, రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట గిద్దలూరు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరిసారాదానమ్మ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరి కె.శ్యామ్‌బాబు, ఎయిడ్ న్యాయవాది పిచ్చయ్య యాదవ్, కోర్టు సిబ్బంది ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

తర్లుపాడు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు గుర్తించేందుకుగాను ముందస్తు జాగ్రత్తగా మండలంలోని పోతలపాడు, తుమ్మలచెరువు, మీర్జాపేట, బుడ్డపల్లి గ్రామాల్లో ఎస్సై వేముల సుధాకర్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఎన్నికల ఫలితాలు వెలువడే సమయంలో కవ్వింపు చర్యలకు పాల్పడే వారిని సీసీ ఫుటేజ్ ద్వారా గుర్తించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ర్యాలీలకు అనుమతులు లేవని, 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఉద్రిక్తతలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనుమానిత వ్యక్తులు, అల్లర్లకు పాల్పడే వారిపై నేరుగా తనకు గానీ, డయల్



పోతలపాడులో ఏర్పాటు చేసిన నిఘా కెమెరా

100కు గానీ సమాచారం అందించాలని కోరారు.

ఫిజిక్స్‌పై విద్యార్థులకు అవగాహన

మార్కాపురం టౌన్: శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే రీతిలో ఫిజిక్స్‌లో వివిధ అంశాలపై సాధనా డిగ్రీ కళాశాల హెచ్‌ఓడీ డాక్టర్ శేషకుమార్ వివరించారు. మంగళవారం శాఖా గ్రంథాలయంలో 12వ రోజు శిక్షణ శిబిరాన్ని గ్రంథపాలకుడు జీవీ శివారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు గణితంతో దూరాలను కొలవటం, కాంతి ప్రాముఖ్యత తదితర అంశాలను వివరించారు. అలాగే విద్యార్థులకు కథలు చెప్పించడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, చేయించడం, చదరంగం, బ్రెయిన్ గేమ్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శేషుకుమార్, పక్కన శివారెడ్డి

మూడంచెల భద్రతపై అవగాహన



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న రాజకీయ పార్టీల నాయకులు

దర్శి: కౌంటింగ్ రోజు మూడంచెల భద్రతపై నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల అభ్యర్థులకు, ప్రతినిధులకు కౌంటింగ్ ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతపై ఆర్వో లోకేశ్వరరావు అవగాహన కల్పించారు. ముందుగా ఒంగోలులోని రైజ్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ హాల్ చూపించి కౌంటింగ్ జరిగే ప్రక్రియ గురించి వివరించారు. బార్ కోడింగ్, కౌంటింగ్ హాలులో భద్రత ఏర్పాట్ల గురించి తెలియజేశారు. అనంతరం దర్శిలో జరిగిన సమావేశంలో లోకేశ్వరరావు మాట్లాడుతూ రైజ్ కాలేజీకి చేరుకోవాల్సిన సమయం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పార్కింగ్ సౌకర్యాలు, భోజన సదుపాయాలు, కౌంటింగ్ సమయంలో నియమాలు, ఉల్లంఘనలకు పాల్పడితే తీసుకునే చట్టపరమైన చర్యల గురించి వివరించారు. అన్నీ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.





ఆహ్లాదకరంగా కనిపిస్తున్న కొండ ప్రాంతం

ఆహ్లాదం.. ముగ్ధ మనోహరం

కొనకనమిట్ల: ఆహ్లాదకరమైన ప్రకృతి దృశ్యాలు చూస్తే మనసు పులకిస్తుంది. తొలిసంధ్య వేళలో తొలిపొద్దు పొడుపులో తెలవారే తూరుపులో కనిపించే అందాలు, ఆకాశం సప్తవర్ణ శోభితమై మనోరంజితంగా ఉంటుంది. ప్రకృతి పరవశించిన మనోహరమైన దృశ్యాలను కనులారా చూడగానే మనసు ఉత్తేజంగా ఉంటుంది. తెలతెలవారే తొలి కిరణాలతో తొంగి చూస్తున్న భానుడిని, మళ్లీ సాయంత్రం వేళ చల్లటి పైరు గాలి తాకి కొండల్లో పవళించడానికి జారుకుంటున్న దృశ్యాలు చూస్తుంటే ప్రకృతి ప్రేమికుల మనస్సు పులకరించాల్సిందే.. పచ్చని పొలాలు, కొండలపై పచ్చదనం, మోడు వారిన చెట్లను చూస్తే ఆ ప్రాంతం అంతా ఆహ్లాదకరంగా మనసు పరిమళించేలాగా, ఉత్తేజపరిచేలా ఉంటుంది. ఈ దృశ్యాలను కొనకనమిట్ల మండలంలో 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.



రహదారి వెంట చింత చెట్ల సోయగాలు





మోడు వారిన చెట్ల మధ్య భానుడు

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పెద్దారవీడు: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుందంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ జి.రవి అన్నారు. స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీజనల్ వ్యాధులపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రవి మాట్లాడుతూ గ్రామాల్లో రోజూ ఇంటిని సందర్శించి జ్వర పీడుతులు ఉన్నచోట రక్త నమూనాలు సేకరించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని సూచించారు. ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, సచివాలయం పరిధిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ అందుబాటులో ఉండాలన్నారు. డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైందని, సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా వంటి



మాట్లాడుతున్న డాక్టర్లు రవి, జగదీష్

జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, జ్వర పీడుతులను గుర్తించి వీలైనంత త్వరగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపించాలన్నారు. గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం కచ్చితంగా నిర్వహించాలని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ సుభానీ, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాచైతన్య ప్రచారోద్యమం



పిల్లలు, తల్లిదండ్రులతో నాగమణి

కురిచేడు: మండలంలోని రామాంజనేయకాలనీలో మంగళవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యాచైతన్య ప్రచార ఉద్యమం నిర్వహించారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ దర్శి నియోజకవర్గ కన్వీనరు గుంటూరు నాగమణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ లక్ష్మి, ఏఎన్‌ఎం వి. పద్మావతి పాల్గొన్నారు. ఏఎన్‌ఎం పద్మావతి మాట్లాడుతూ బడికి వెళ్లడం పిల్లల హక్కు, చదివించటం అందరి బాధ్యత అనే నినాదంతో పిల్లలకు,తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చదువుకుంటే జ్ఞానం, నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని పద్మావతి తెలిపారు. తన మీద తనకు నమ్మకం పెరుగుతుందని, జీవితానికి భద్రత, భరోసా చదువు ఉంటుందన్నారు. బడిమానేసిన పిల్లలు, బడిబయట తిరిగేవారు బడిలోపలికి రీ ఓపెనింగ్ సమయంలో బడికి వెళ్లాలని సూచించారు. ప్రభుత్వం అమ్మఒడి, విద్యాదీవెన, విద్యాకానుక, వసతిదీవెన, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు మరెన్నో ఉచితంగా ప్రభుత్వం ఇస్తుందని అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి తెలిపారు. పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.